క్లుప్తంగా

ఆలయ నిర్మాణ పనులు పూర్తి

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.50లక్షలు మంజూరు



మక్కపేట(వత్సవాయి):గ్రామంలో చేపట్టిన శ్రీఅన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఈ ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన ఆలయ నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరడంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.50లక్షలను విడుదల చేసింది. ఈ నిధులతో చేపట్టిన పనులు పూర్తయ్యాయి. వచ్చేనెలలో ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అర్చకులు తెలిపారు.

నేడు ప్రజాసమస్యల పరిష్కార వేదిక

కంచికచర్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ పి.జాహ్నవి ఆదివారం తెలిపారు. ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందజేస్తే, ప్రాధాన్యక్రమంలో పరిష్కరిస్తామని వివరించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

విజేతలకు బహుమతులు అందజేత

నందిగామటౌన్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ 125వ జయంతి సందర్భంగా ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని మండవ వరలక్ష్మి మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ మండవ పిచ్చయ్య పేర్కొన్నారు. ట్రస్ట్ సౌజన్యంతో నేతాజీ యూత్ ఆధ్వర్యంలో పట్టణంలోని 11వ వార్డు నేతాజీనగర్‌లో ఆదివారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మి, స్వర్ణలత, షఫ్తక్ దాదాహుసేన్, రసూల్, గురునాథం, నరసింహారావు, గోపాల్, నాగులుమీరా తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సాంస్కృతిక కార్యక్రమాలు


నందిగామ టౌన్: రాష్ట్ర సృజనాత్మక, సంస్కృతి సమితి ఆధ్వర్యంలో చందర్లపాడులోని అలివేలమ్మ అమ్మవారి ఆలయం వద్ద మూడు రోజులుగా నిర్వహిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు ఆదివారంతో ముగిశాయి. ఎన్టీ రామారావు వర్ధంతి సందర్భంగా మూడురోజులపాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించినట్లు మద్దినేని శివరాజేంద్ర ప్రసాద్ తెలిపారు. ముఖ్యంగా శ్రీకృష్ణరాయబారం, బాలనాగమ్మ, శ్రీరామాంజనేయయుద్ధం నాటక ప్రదర్శనలు ప్రజలను ఆకట్టుకున్నాయని వివరించారు. ప్రస్తుత సమాజంలో సైతం నాటక ప్రదర్శనలపై ఆసక్తిచూపుతున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

అమ్మవారికి పూజలు



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీ గోపయ్య సమేత శ్రీలక్ష్మీతిరుపతమ్మ అమ్మవారిని రాష్ట్ర నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోట శివనంద ఆదివారం దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలుకగా, ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆయనను దుశ్శాలువతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయన ఆలయ ప్రాంగణంలో ఉన్న కల్యాణకట్టను పరిశీలించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల హామీలోభాగంగా నాయీబ్రాహ్మణులకు రూ.25వేల ఇప్పించే విధంగా ముఖ్యమంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డైరెక్టర్ నాగరాజు, సంఘ పెద్దలు కొలిపాక బ్రహ్మం, ఏలూరి కృష్ణ, నాగేశ్వరరావు, ఉప్ప నరసింహారావు, రాము, వెంకట్రావ్, ఎర్రస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని బలుసుపాడు రోడ్‌లో వేంచేసియున్న పాత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం హనుమాన్ చాలీసా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పూజా కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు పాల్గొని పూజలు చేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, మాజీ అధ్యక్షుడు చౌడవరపు జగదీష్, కనకదుర్గమ్మ దేవస్థానం డైరెక్టర్ నంబూరి రవి, నాయకులు కన్నమాల శామ్యూల్, గోగుల వెంకయ్య, గంగోలు వినోద్, గొట్టిపాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యానికి లభించని గిట్టుబాటు ధర

- తేమశాతం పేరుతో ధాన్యానికి లభించని గిట్టుబాటు ధర..
- కొనుగోలు కేంద్రాలవైపు కన్నెత్తి చూడని రైతులు
- పెట్టుబడులు కూడా దక్కని వైనం తీవ్రనష్టాల్లో ఖరీఫ్ రైతులు



వత్సవాయిలో సంచులలో నింపిన ధాన్యం

వత్సవాయి: ఆరుగాలం రెక్కలుముక్కలు చేసుకుని కష్టపడి పండించిన పంటకు గిట్టుబాటు ధర లేకపోవడంతో వరిసాగు రైతులు అప్పులపాలవుతున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వేసిన వరి పంట దిగుబడులు ఆశాజనకంగా ఉన్నప్పటికీ ధాన్యానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు తీవ్ర నిరాశ నిస్పృహలకు లోనవుతున్నారు.

6వేల హెక్టార్లలో వరిసాగు...

జగ్గయ్యపేట నియోజకవర్గంలో మూడు మండలాల్లో కలిపి ఖరీఫ్ సీజన్‌లో మొత్తం 6వేల హెక్టార్లలో వరిపంటను సాగు చేశారు. జగ్గయ్యపేట మండలంలో 2741 హెక్టార్లు, పెనుగంచిప్రోలు 1984, వత్సవాయి మండలంలో 1275 హెక్టార్లలో వరి సాగుచేశారు. గతేడాది కంటే సుమారు 600ఎకరాల్లో సాగు విస్తీర్ణం తగ్గింది.

రైతు శ్రమ వృథానేనా..

ఖరీఫ్ సీజన్‌లో వర్షాలు ముందుగానే పడటంతో రైతులు సకాలంలో వరినాట్లు వేశారు. మొదట్లో వరికి చీడపీడల ఆశించినప్పటికీ రైతులు పురుగు మందులను వాడి పంటను కాపాడుకున్నారు. దీంతో పెట్టుబడులు గతంలో కంటే పెరిగిపోయాయి. మాగాణి దమ్ము చేయించడంతోపాటు వరినారు పోయడం, నాట్లు, మందుకట్టలు, పురుగుమందుల పిచికారీతో పాటు రెండుసార్లు కలుపుతీతలు, వరిని కోతలతోపాటు ధాన్యాన్ని ఇంటికి చేర్చేవరకు అన్ని పెట్టుబడులే. ఇలా ఎకరాకు రూ.25వేల వరకు ఖర్చుచేయక తప్పని పరిస్థితి. ఇక కౌలుకు పొలం తీసుకుంటే కౌలుఖర్చులు ఇందుకు అదనం. ఆరుగాలం కష్టపడి రైతులు ఎకరాకు 25 బస్తాల నుంచి 30వరకు దిగుబడి సాధించగా, ప్రస్తుతం ప్రభుత్వం ధాన్యం బస్తాకు రూ.1800 మించి ధర చెల్లించకపోతుండటంతో ఖరీఫ్ సీజన్‌లో పడిన పడిన శ్రమ అంతా వృథాగా పోయినట్లేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక వరదలు, ఇతర కారణాలతో దిగబడులు తగ్గిన పొలాలకు చెందిన రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రాక అప్పులే మిగిలాయి.

అక్కరకురాని కోనుగోలు కేంద్రాలు...

ప్రభుత్వం ఆర్భాటంగా ఏర్పాటు చేసిన కోనుగోలు కేంద్రాలు రైతులకు ఉపయోగపడటం లేదు. ప్రభుత్వం నిర్దేశించిన సవాలక్ష నిర్ణయాలతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ముందుగా శాంపిల్ ధాన్యాన్ని కొంత కొనుగోలు కేంద్రానికి తీసుకురావడం, అక్కడ పరీక్షలు నిర్వహించి తేమశాతం ఎంత ఉన్నది తెలుసుకుని కేంద్రం నిర్వాహకులు ఎప్పుడు తీసుకురమ్మంటే అప్పుడే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తీసుకువెళ్లాలి. తీరా ధాన్యాన్ని కేంద్రానికి తరలిస్తే ధాన్యంలో రాళ్లు, చెత్తాచెదారం ఉందని చెప్పి ధరను తగ్గించడం వంటి సాకులతో ధాన్యం ధరను తగ్గిస్తున్నారు. దీంతో ధాన్యం కొనుగోలు కేంద్రాల వైపు వెళ్లాలంటేనే రైతులు జంకుతున్నారు. దీంతో ప్రైవేటు వ్యాపారులనే ఆశ్రయిస్తున్నారు. ఇకనైనా రాష్ట్రప్రభుత్వం స్పందించి ధాన్యానికి తగిన గిట్టుబాటు ధర కల్పించడంతోపాటు తేమశాతం, రాళ్లు..చెత్తాచెదారం పేరుతో ధరను తగ్గించకుండా తమకు తగిన న్యాయం జరిగేలా చూడాలని వరిసాగు రైతులు కోరుతున్నారు.

అమిత్ షా.. గోబ్యాక్ : సీపీఎం



నందిగామ గాంధీసెంటర్‌లో నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు



పేటలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

నందిగామటౌన్:భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ప్రజలకు క్షమాపణ చెప్పి రాష్ట్రంలోకి రావాలని సీపీఎం నాయకుడు కటారపు గోపాల్ డిమాండ్ చేశారు. అమిత్ షా రాష్ట్రాన్ని రావడాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీసెంటరులో ఆదివారం నల్లబ్యాడ్జిలు ధరించి అమిత్ షా గోబ్యాక్ నినాదాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ రాష్ట్రానికి అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వానికి మద్దతు పలికిన టీడీపీ, జనసేన పార్టీలు ప్రజలకు ఏం సమాధానం చెబుతాయని ప్రశ్నించారు. అంబేడ్కర్‌ను అవమానించేలా మాట్లాడిన అమిత్ షాకు రాష్ట్రంలో పర్యటించే హక్కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమిత్‌షా తక్షణమే రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు కరి వెంకటేశ్వరరావు, గోపీనాయక్, శ్రీనివాసరావు, నారాయణ, హుసేన్, రవి, ఏసోబు, లాజర్, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేటలో నిరసన ...

జగ్గయ్యపేటఅర్బన్: కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటనను నిరసిస్తూ పేట సీపీఎం నాయకులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ కూడలిలో అమిత్‌షా గోబ్యాక్ అంటూ సీపీఎం నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పట్టణ, మండల కార్యదర్శి సోమోజు నాగమణి మాట్లాడుతూ రాష్ట్రానికి అన్యాయం చేసిన బీజేపీకి టీడీపీ, జనసేన పార్టీలు మద్దతు పలకడం శోచనీయమన్నారు. పార్లమెంట్‌లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపరచిన అమిత్ షా తక్షణమే ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగం పట్ల గౌరవ మర్యాదలు లేని అమిత్ షా తక్షణమే రాజీనామా చేయాలన్నారు. అమిత్‌షాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నిరసనలో సీపీఎం నాయకులు దాసరి నాగేశ్వరరావు, రావెళ్ల శేషు, వి.వి.రాంప్రసాద్, కోటా కృష్ణ, కోటా రవి కుమార్, దంతాల వెంకటేశ్వర్లు, నరేంద్ర, కాకనబోయిన వెంకటేశ్వర్లు, కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

వీరమణితేజ కుటుంబానికి అండగా ఉంటాం



ముప్పాళ్ల(నందిగామటౌన్): నల్లాని వీరమణితేజ మృతి బాధాకరమని, ఆయన కుటుంబానికి అండగా ఉంటామని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. చందర్లపాడు మండలం ముప్పాళ్లలో ఆదివారం వీరమణి తేజ సంస్మరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మణితేజ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ అరుణకుమార్ మాట్లాడుతూ ఎంతో మంచి భవిష్యత్తున్న మణితేజ అకాలమృతి తమను కలిచి వేసిందన్నారు. ఆయన మృతిపై ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత పోలీసులు, కూటమి ప్రభుత్వంపై ఉందన్నారు. మణితేజ మృతిని హత్యగానే భావిస్తున్నామని హత్యకు కారకులను గుర్తించి కఠిన చర్యలు తీసుకునేలా పోరాడతామన్నారు. అనంతరం మృతుని తండ్రి నల్లాని సాయి, కుటుంబసభ్యులను పరామర్శించారు. అండగా ఉంటామని వారికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో నాయకులు నెలకుదిటి శివనాగేశ్వరరావు, నల్లాని అయ్యన్న, బండారుపల్లి కపిల్, పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మందుబాబులకు అడ్డాగా బస్ షెల్టర్



మందుబాబులకు అడ్డాగా మారిన బస్ షెల్టర్

వీరులపాడు:మండలంలోని గోకరాజుపల్లి గ్రామంలోని బస్‌షెల్టర్ ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా మారింది. కంచికచర్ల మండలం చెవిటికల్లు నుంచి వత్సవాయి గ్రామానికే వెళ్లే ప్రధాన రహదారిలో బస్సు, ఆటో, ఇతర వాహనాల కోసం వేచి ఉండే ప్రయాణికుల కోసం కొన్నేళ్ల కిందట బస్సు షెల్టరు నిర్మించారు. పగటి సమయంలో ఎలా ఉన్నా రాత్రి సమయంలో మాత్రం బస్‌షెల్టర్ ఆకతాయిలు, మందుబాబులకు అడ్డాగా మారింది. మందుబాబుల కారణంగా అక్కడ వేచి ఉండేందుకు ఇబ్బందులు పడుతున్నట్లు మహిళా ప్రయాణికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. నిత్యం మందుబాబులు బస్‌షెల్టర్‌లో కూర్చుని మద్యం సేవిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖల స్పందించి బస్‌షెల్టర్‌లో ఎవ్వరూ మద్యం సేవించకుండా తగిన చర్యలు తీసుకోవాలని మహిళా ప్రయాణికులు కోరుతున్నారు.

దమ్ముచక్రాలతో రోడ్లు ఛిద్రం



దమ్ము చక్రాలతో వెళ్తున్న ట్రాక్టర్

జగ్గయ్యపేట: గ్రామీణ ప్రాంతాలలో రూ.కోట్ల వ్యయంతో నిర్మించిన రహదారులు ట్రాక్టర్ల దమ్ము చక్రాల కారణంగా ఛిద్రమైపోతున్నాయి. దమ్ము చక్రాలతో కూడిన ట్రాక్టర్లు ఆయారోడ్లపై యథేచ్ఛగా తిరుగుతుండటంతో రోడ్లు దెబ్బతింటున్నాయి. దీంతో ఆయా రోడ్లలో ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి.

నిబంధనలు భేఖాతరు..

దమ్ము చక్రాలతో టాక్టర్లు బీటీ, సీసీ రోడ్లపైకి రాకుండా చూడాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండటంతో ఆయా రోడ్లు దెబ్బతింటున్నాయి. ప్రస్తుతం వ్యవసాయ రబీ సీజన్ కావడంతో గ్రామాల్లో చెరువులు, మున్నేరు, బావులు కింద వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దీంతో పొలాల్లో దమ్ము చేయాలంటే ట్రాక్టర్ల చక్రాలకు ఇనుప చక్రాలు బిగించి దమ్ము చేస్తారు. ట్రాక్టర్లకు పొలం వద్దనే దమ్ము చక్రాలను బిగించాల్సి ఉన్నా ట్రాక్టర్ యజమానులు నిబంధనలకు విరుద్ధంగా ఇళ్ల వద్దనే దమ్ము చక్రాలను ఏర్పాటు చేసుకుని ఆయా రోడ్లలో ప్రయాణిస్తూ పొలాలకు చేరుకుంటున్నారు. దీంతో రోడ్లు బీటలు వారడమే కాకుండా వర్షంనీరు రోడ్లపై నిలిచి గోతుల్లో నిలిచి రోడ్లు కాస్తా శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల్లోని పలు గ్రామాల్లో రోడ్లన్నీ దమ్ము చక్రాల కారణంగా దెబ్బతింటున్నాయని ఆయాగ్రామాల ప్రజలు చెబుతున్నారు. భద్రతా మసోత్సవాల సందర్భంగానైనా ఆర్‌అండ్‌బీ, పోలీసు, రవాణాశాఖ అధికారులు స్పందించి ఆయా రోడ్లపై దమ్ముచక్రాలతో ట్రాక్టర్లను నడుపుతున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు

తగుచర్యలు తీసుకుంటాం..



ఆర్‌అండ్‌బీ రహదారులపై దమ్ముచక్రాలతో ట్రాక్టర్లను నడిపి రోడ్డు దెబ్బతినేందుకు కారకులవుతున్నవారిపై తగిన చర్యలు తీసుకుంటాం. ఈ మేరకు ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లకు అవగాహన కల్పిస్తాం.

– పరుశురాముడు, ఆర్‌అండ్‌బీ డీఈ

కొనసాగుతున్న సంగీతోత్సవాలు

విజయవాడకల్చరల్: హంసధ్వని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పటమట దత్తపీఠంలోని శ్రీ మరకత రాజ రాజేశ్వరీ క్షేత్రంలో నిర్వహిస్తున్న శ్రీ సద్గురు త్యాగరాజ స్వామి ఆరాధనా సంగీతోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన ఆదివారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో కొవ్వూరుకు చెందిన యనమంద్ర శ్రీనివాస శర్మ సంగీతంలో జ్ఞానదృష్టి అంశంగానూ సంస్కృత పండితులు యనమండ్ర వేణుగోపాల శాస్త్రి ఉపాసనా విశిష్టమైన భక్తిఅంశంగా సోదాహరణంగా వివరించారు. నిర్వాహక సంఘ సభ్యుడు గోపీకృష్ణ శర్మ ప్రసంగించారు. కార్యక్రమంలో అధికసంఖ్యలో సంగీత ప్రియులు పాల్గొన్నారు.

చర్చి పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన



తోటరావులపాడులో చర్చి పునర్నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ అరుణకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్, పక్కన బిషప్ తంటెపూడి జార్జి కొర్నేలియస్

తోటరావులపాడు(నందిగామ టౌన్): భగవంతుని ఆశీస్సులు.. మా అమ్మ ప్రార్థనల కారణంగానే తాము ఈ స్థాయికి చేరామని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. చందర్లపాడు మండలం తోటరావులపాడులో పరిశుద్ధ పౌలు సీఎస్ఐ చర్చి పునర్నిర్మాణ పనులకు కృష్ణా,గోదావరి అధ్యక్షఖండ పీఠాధిపతి బిషప్ తంటెపూడి జార్జి కొర్నేలియస్‌తో కలిసి ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ అరుణకుమార్ మాట్లాడుతూ విశ్వాసంతో చేసే ప్రార్థనలకు ఎంతటి మహిమ ఉంటుందో చెప్పటానికి తాను, తన సోదరుడు మాజీఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు జీవితమే నిదర్శనమని పేర్కొన్నారు. యోర్దాన్ నది దాటడానికి ఏసుక్రీస్తు తోడ్పాటు నందించిన విధంగా ఈ అద్భుతమైన చర్చి నిర్మాణానికి ప్రతిఒక్కరు సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. చర్చి పునర్నిర్మాణానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని అరుణకుమార్ చెప్పారు. చర్చి నిర్మాణానికి రూపొందించిన అంచనాలలో ఒక బాధ్యతను తప్పకుండా తాము తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం బిషప్ కొర్నెలియస్ క్రీస్తు సందేశాన్ని అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ ములకలపల్లి లక్ష్మి, గ్రామ నాయకుడు ములకలపల్లి కృష్ణమోహన్, తోటరావులపాడు డీసరీ చైర్మన్ శ్రీకాకుళపు మోజెస్‌పాల్, చీఫ్ ఇంజినీర్ విజయకుమార్, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి లెప్రసి కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్



లింగాలపాడులో ఆరోగ్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బేబీరాణి

కంచికచర్ల: ఆరోగ్య సిబ్బంది, ఆశవర్కర్లు ప్రతి ఇంటిని సందర్శించి కుష్టువ్యాధి నివారణ కోసం ప్రతివ్యక్తిని పరీక్షించాలని కంచికచర్ల పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ కె.మధురిమ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఏఎన్ఎం, ఆశవర్కర్లతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ మధురిమ మాట్లాడుతూ ఈనెల 20 నుంచి ఫిబ్రవరి 2వ తేదీ వరకు లెప్రసి కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆరోగ్యసిబ్బంది 12రోజుల పాటు ప్రతి ఇంటికి వెళ్లి లెప్రసీ బారిన పడిన వారిని గుర్తించాలని సూచించారు.

లింగాలపాడు పీహెచ్‌సీ పరిధిలో...

నందిగామ మండలం లింగాలపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆదివారం ఆరోగ్య సిబ్బంది, ఆశవర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ బేబిరాణి మాట్లాడుతూ చర్మంపై రాగి రంగు, గోధుమ రంగు స్పర్శలేని మరి ఏ ఇతర మచ్చలను గుర్తించినా వెంటనే ఆ సమాచారాన్ని మెడికల్ ఆఫీసర్‌కు తెలియజేయాలని ఆర్యోగసిబ్బందిని ఆదేశించారు.ఆన్‌లైన్ సర్వే ఏరోజు కారోజు పూర్తి చేయాలన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి సర్వేను ప్రతిరోజు ఉదయాన్నే ప్రారంభించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ మంగలపూడి భిక్షాలు, ఎంపీహెచ్ఎస్ కె.సరోజిని, స్టాఫ్‌నర్సులు, ఆరోగ్య సిబ్బంది, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహం ఏర్పాటుకు స్థలం ఎంపిక



జగ్గయ్యపేటఅర్బన్: జగ్గయ్యపేట పట్టణంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటు చేస్తున్నట్లు ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం నిర్మాణ కమిటీ, ఉత్సవ కమిటీ, హిందూ చైతన్య వేదిక కమిటీ ప్రతినిధులు తెలిపారు. స్థానిక విజయవాడ రోడ్‌లో తొర్రగుంటపాలెం సెంటర్‌లో విగ్రహం ఏర్పాటుకు అనువైన స్థలాన్ని ఆదివారం కమిటీ ప్రతినిధులు పబ్బతి నరేంద్ర, పిన్నం వెంగళరావు, సంకా భాస్కర్, తూములూరి అశోక్, నోముల రఘు తదితరులు ఎంపిక చేశారు. శివాజీ విగ్రహాన్ని జె.విష్ణు అందజేయనున్నట్లు వారు తెలిపారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహం ఏర్పాటు సమాచారం మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రకు తెలియజేయడంతో ఆయన వచ్చి స్థలాన్ని పరిశీలించారు. విషయాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), ఇతర పెద్దల దృష్టికి తీసుకువచ్చి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. విగ్రహం ఏర్పాటుకు తమవంతు సహకారం అందిస్తామని చైర్మన్ హామీ ఇచ్చారు.

రైతులను ముంచిన కూటమి ప్రభుత్వం

తన్నీరు నాగేశ్వరరావు



పేటలో విలేకరులతో మాట్లాడుతున్న తన్నీరు నాగేశ్వరరావు, పక్కన బేబీరాణి, నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్:ఎన్నికల సమయంలో రైతులకు అనేక హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను నిలువునా ముంచిందని జగ్గయ్యపేట వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తంచేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రైతులకు తొమ్మిది గంటలపాటు ఉచిత కరెంటు ఇస్తామని నమ్మబలికి, కూటమి ప్రభుత్వం తీరా అధికారంలోకి వచ్చాక కనీసం ఏడుగంటలు కూడా సజావుగా ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతోందన్నారు. ఈ విషయంపై విద్యుత్‌శాఖ అధికారులను ప్రశ్నిస్తే లోడ్ రిలీఫ్(ఎల్ఆర్), మెయిన్ సప్లై పోయిందంటూ సమాధానమిస్తున్నారని తెలిపారు. విద్యుత్ సరఫరా సరిగా లేక వరి, మొక్కజొన్న, మిర్చి పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వ పాలనలో రైతులకు యూరియా కూడా దొరకడం లేదన్నారు. మార్కెట్‌లో రూ.270లకు లభించాల్సిన యూరియాను బ్లాక్‌మార్కెట్‌లో రూ.350లకు విక్రయిస్తుండటంతో రైతులపై అధికభారం పడుతోందన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులకు బీపీటీ ధాన్యాన్ని బస్తా రూ.2,100 కొనుగోలు చేయగా, కూటమి ప్రభుత్వం రూ.1450 నుంచి రూ.1550 మధ్య కొనుగోలు చేస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రైతులకు 9గంటలపాటు విద్యుత్ సరఫరా, వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించేవరకు వైఎస్సార్ సీపీ రైతుల పక్షాన పోరాటం చేస్తూనే ఉంటుందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీని అమలు చేయాలని తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

జగన్ హయాంలోనే బీసీలకు ప్రాధాన్యం..

రాష్ట్ర బీసీ చైతన్య సంక్షేమ సంఘం అధ్యక్షురాలు బేబీరాణి మాట్లాడుతూ బీసీలకు పెద్ద పీటవేసి వారి సంక్షేమానికి కృషిచేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పదవుల్లో బీసీలకు, మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా వారి సంక్షేమానికి కృషిచేశారన్నారు. సమిష్టిగా పనిచేసి జగన్‌మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలుద్దామని పిలుపునిచ్చారు. అనంతరం బేబీరాణిని తన్నీరు నాగేశ్వరరావు సత్కరించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వట్టెం మనోహర్, పట్టణ సమాఖ్య మహిళ మాజీ అధ్యక్షురాలు షేక్ మునీరాబేగం, పార్టీ జిల్లా ప్రధానకార్యదర్శి చల్లా వైకుంఠరావు, జిల్లా కార్యదర్శి వేముల మల్లేశ్వరరావు, దుర్గగుడి డైరెక్టర్ నంబూరి రవి, రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ బత్తుల రామారావు, మాజీ ఎంపీపీ పెంటి శ్రీనివాసరావు, నాయకులు కన్నమాల శామ్యూల్, చాపల వెంకటేశ్వర్లు, దేరంగుల శ్రీను, గోగుల వెంకయ్య, గంగోలు వినోద్, గొట్టిపాల సురేష్, బండి రాజు, పిట్టల సత్యనారాయణ, రాష్ట్ర బీసీ నాయకురాలు పోలంపల్లి రాధమ్మ,నరసింహారావు, జవ్వాజి నరసింహారావు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి : ఏసీపీ



కీసర టోల్‌ప్లాజా వద్ద ద్విచక్రవాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఏసీపీ తిలక్

కీసర(కంచికచర్ల):రోడ్డు భద్రతా నియమాలు ప్రతి ఒక్కరూ పాటిస్తే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని నందిగామ సబ్‌డివిజన్ ఏసీపీ ఎ.బాలగంగాధర్‌తిలక్ పేర్కొన్నారు. జాతీయ భద్రతా మాసోత్సవాల సందర్భంగా మండలంలోని కీసర టోల్‌ప్లాజా వద్ద వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై ఆదివారం ఆయన అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ద్విచక్ర వాహదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవర్ విధిగా సీట్‌బెల్టు పెట్టుకోవాలన్నారు. మితిమీరిన వేగంతో వెళ్లకుండా పరిమితికి లోబడి వాహనాలను నడపాలన్నారు. ముఖ్యంగా మద్యం సేవించి, రాంగ్‌రూట్‌లో వాహనాలను నడపరాదన్నారు. వాహనాలు నడిపే సమయంలో విధిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనానికి సంబంధించిన పత్రాలు కూడా అందుబాటులో ఉంచుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాజు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.